

# భవానీద్వీపం

## – వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 68 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

వీ యీజ్ దార్' (ఎవరక్కడ?) కంచు గంటలా మోగింది డచ్చి సిపాయి 'డేర్క్' కంఠం. రెండు నిలువుల ఎత్తునున్న ప్రహరీ నుండి పడుతున్న కాగడా వెలుగులో మూడు అడుగుల దూరంకన్నా స్పష్టంగా కనబడడం లేదు. నిలువెత్తున పెరిగిన తిప్ప తీగలు, పొదల మధ్యన కదలికలేవో కనిపించాయి అతడికి. తుపాకీ గొట్టంతో తీగలూ, పొదలూ విడదీసి చూడడానికి ప్రయత్నం చేస్తూ ముందుకు అడుగులు వేశాడు డేర్క్.

'నీకెప్పుడూ యింతే! ఎవ్వరికీ కనిపించనివి అన్నీ నీకే కనిపించేలా చేస్తాడు ఆ 'ఊడాన్' (డచ్చివారికి శౌర్యానికి పరాక్రమానికి ప్రతీక ఐన దేవుడు) అంటూ అనుమానంగా చుట్టూ కలయ జూస్తూ అతడిని అనుసరించాడు అనుచరుడు గేయిట్. చీకటి వేళలో పొదలూ తుప్పలలోకి వెళ్ళడం అంటే చచ్చే జంకు అతడికి. క్రితం నెలలోనే అతడు డేర్క్ తో కలిసి నాగులవంచ స్థావరానికి వచ్చాడు. అడుగు తీసి అడుగు వేయాలంటే పగటిపూటే పాముల భయం అతడికి.

'ఈ రెండు మూడు రోజులు మనం చాలా జాగ్రత్తగా ఉండాలని మనకు చెప్పలేదూ? పెద్ద ఎత్తున తిరుగుబాటుకు పథకాలు రచిస్తున్నారని మన గూఢచారులు చెప్పారని అనలేదూ? మచిలీపట్నం నుండి మనవాళ్ళు అదనంగా బలగాలు పంపేదాకా ఒక్కొక్కళ్ళం ముగ్గురి పని చేయాలని చెప్పలేదూ?' లోగొంతుకతో సహచరుడిని ఉత్సాహపరుస్తూ తుప్పలు తొలిగించి చూస్తూ ఒక్కొక్క అడుగే వేస్తున్నాడు డేర్క్. చివరగా ఉన్న పొదల మాటున కూడా చూసి అనుమానం తీర్చుకుందామని ముందుకు కదిలాడు

డేర్క్. కాలికింద మెత్తగా పొలుసులు పొలుసులుగా ఏదో తగిలినట్టు అనిపించింది.

సర్రున ఆరడుగుల ఎత్తున లేచి ఆగ్రహంతో బుసలు కొట్టింది రాచనాగు. చేతిలో ఉన్న నాటు తుపాకీని ఉపయోగించాలనే ఆలోచన మెదులుతుండగానే మెరుపులా పడగ విసిరింది. తత్తరపడుతూ వెనక్కు దూకాడు డేర్క్. వెంట్రుక వాసిలో దాని కోరలకు అందకుండా జారి పోయింది అతడి ముంజేయి. ఆ అదటుకు చేతిలోని తుపాకీ జారి తుప్పల మీద పడిపోయింది.

తుపాకీ మడమ తగిలి నేలకు వాలింది ఆ సర్పం. కాటు తప్పించుకున్నాడన్న కసి, నడుముకు తగిలిన దెబ్బ రెచ్చగొట్టాయి దాన్ని. నల్లటి కెరటంలా పూర్తిగా తోక మీద లేచింది పద్నాలుగు అడుగుల పొడవున్న ఆ రాచనాగు. కాగడాల మసక వెలుతురులో నల్లని శరీరం మీద గోధుమ రంగు పొడలతో తళతళ మెరిసిపోతున్న దాన్ని చూసి గుండెలు అవిసిపోయాయి 'గేయిట్'కి.

తన తుపాకీ గురిపెట్టే సమయమూ, ధైర్యమూ లేక వెనక్కు దూకి 'పరుగెత్తు! వెనక్కు వచ్చెయ్యి' అని అరిచాడు గేయిట్. గిర్రున పక్కకు తిరిగాడు డేర్క్. పక్కకు దూకి తప్పించుకుందామని ఆశ పడ్డాడు. పక్కకు తిరుగుతుండగానే పిడుగులా అతడి మెడ మీద పడింది కాటు. కెవ్వున కేక వేసి చెట్టులా నేలకు కూలిపోయాడు.

అతడు నేలమీద కూలిపోయిన తరువాత కూడా వదలలేదు ఆ రాచనాగు. పొర్లుతూ, దాని మెడను పట్టుకుని లాగటానికి విఫల ప్రయత్నం చేశాడు డేర్క్. ముందు అతడి మెడను, తర్వాత చేతిని కరిచి పట్టుకుని కోరలలోని విషమంతా అలలు అలలుగా చిమ్మి చిమ్మి అతడి ఒంట్లో నింపింది. కాగడాల మసక వెలుతురును చీల్చుకుంటూ మెరుపులా చీకట్లలో కలిసిపోయింది.

వెర్రిగా భయంగా కేకలు పెడుతూ సహచరుడి వద్దకు చేరుకున్నాడు గేయిట్. అప్పటికే నురగలు కక్కుతూ ప్రాణాలు వదిలేశాడు డేర్క్. బొగ్గులా నల్లగా మారిపోయింది అతడి శరీరం. సహచరుడి శవాన్ని భుజాలకెత్తుకొని, గుండెలు బద్దలయ్యేలా రోదిస్తూ కోట ప్రహరీ ద్వారం వైపు పరుగులు పెట్టాడు గేయిట్.

రెండు క్షణాల తరువాత నెమ్మదిగా పొదలను తొలగించుకుని తొంగిచూసింది ఒక తల. పెద్ద బండలా యింత లావు ఉన్న ఆ తల ముత్తారం మొండి జగ్గడిది. చివ్వున లేచింది యింకొక ఆకారం. పొదల మీద పడిపోయిన డేర్క్ తుపాకి అందుకోడానికి ప్రయత్నించింది. పర్వతమంత ఆకారం అయినా చిరుతలా కదిలాడు జగ్గడు. తుపాకీని అందుకోడానికి ప్రయత్నించిన యువకుడి నడుమును కొండచిలువలా చుట్టుకుని కన్ను మూసి తెరిచేలోపు పొదల మాటుకు దొర్లాడు. ఇనుప గుదియలాంటి పిడికిలిని కోపంగా పైకెత్తాడు.

ఆ పిడికిలి దెబ్బకు యువకుడి తల బద్దలయ్యేదే కానీ ఆఖరి నిముషంలో తన ఆవేశాన్ని అదుపు చేసుకున్నాడు.

డేర్క్ మృతదేహాన్ని చూసిన మరుక్షణం గేయిట్ తో కలిసి అక్కడికి చేరుకుంటారు అందుబాటులో ఉన్న అధికారులు, సిపాయిలు. ఆ ప్రాంతమంతా తూర్పారబడుతారు. తుపాకీ ఎలా మాయమవుతుంది? ఎవరో అంతవరకూ అక్కడ మాటు వేశారు అని తెలిసిపోతుంది. డేర్క్ అనుమానం నిజమే అని తెలిసిపోతుంది. తను చేయబోయిన పొరబాటు తెలిసి, క్షమార్పణగా రెండు చేతులూ జోడించాడు ఆ యువకుడు.

డేర్క్ మరొక ఐదడుగులు ముందుకు వేసి తుప్పలు తొలిగించి చూస్తే తమ ఉనికి తెలిసిపోయేది. అందరి ప్రాణాలు గాలిలో కలిసిపోయేవి. పోతే పోయేవి, ఎప్పుడైనా పోవలసినవే. తల్లి నేలకు పనికిరాకుండా పోయేవి. రాచనాగు పుణ్యమా అని అది జరగలేదు. అదే అదృష్టం అనుకుంటే, దట్టమైన తుప్పలమీద పడడం వల్లనో, నాగులవంచ చేసుకున్న అదృష్టం వల్లనో తుపాకీ పేలకపోవడం మరొక అదృష్టం.

'డేర్క్'కు బదులుగా తనను రాచనాగు సమీపిస్తే ఏం జరిగుండేదో మనసులో మెదిలి మొండి జగ్గడు కూడా క్షణకాలం కంపించిపోయాడు. మదపుటేనుగును సైతం రెండే క్షణాలలో మృత్యువుకు ఎర చేస్తుంది రాచనాగు విషం. వరుసగా ఇరవై ఏడు మందిని చంపగలిగే విషాన్ని ఒక కాటులో చిమ్మగలదు రాచనాగు. తమను వదిలి, శత్రుబలితో విజయీభవ అని ఆశీర్వదించింది ఆ రాచనాగు. 'వచ్చే నాగుల చవితికి నాగులవంచ మొత్తాన్నీ నీ నోము పట్టిస్తా నాగమ్మ తల్లీ' అని రాచనాగుకు మనసులోనే మొక్కుకున్నాడు మొండి జగ్గడు. 'జరిగింది మరిచిపో' అన్నట్లు యువకుడి భుజాన్ని తట్టి మరొక రాచనాగులా వడిగా ముందుకు కదిలాడు.

ప్రహరీ గోడ ఈశాన్యం మూలకు చేరుకున్నాడు. అతడిని అనుసరించారు మిగిలిన తొమ్మిదిమంది. తన దళంలోని వందమందిని యాభైమంది చొప్పున రెండు భాగాలు చేశాడు జగ్గడు. ఒక బృందం మందుగుండు నిలవ చేసిన గిడ్డంగి సంగతి చూసుకోవాలి. మరొక బృందం తుపాకులున్న గిడ్డంగి సంగతి చూసుకోవాలి.

ఒక్కొక్క దళంలో పదిమంది ముందు దారి చేయాలి. ఆ తరువాత మిగిలిన నలభైమంది రెండు బృందాలుగా అనుసరించాలి. ప్రణాళిక విఫలం అయితే అందరినీ ఒకేసారి కోల్పోకుండా ఉండడం కోసం, వెనుకనుండి రక్షణ కవచంగా ముందున్న వారిని కాచుకుంటూ అనుసరించడం కోసం ఆ వ్యూహం.

ఈశాన్యం మూలన ప్రహరీకి సరిగ్గా నాలుగు అడుగుల దూరంలో మూడడుగుల ఎత్తున నున్నగా చెక్కిన సరిహద్దు రాయి ఉన్నది. అలా ఆగ్నేయం, నైరుతి, వాయవ్యం ప్రతి మూలనా సరిగ్గా అలాగే చెక్కిన సరిహద్దు రాళ్ళు ఉన్నాయి. నాలుగు పక్కలా సరిహద్దులను సూచించే రాళ్ళు మాత్రమే కావు అవి. వాటిలో కోటకు, కోటలోనివారికి రక్షణకు సంబంధించిన రహస్యాలు ఉన్నాయి.

ఎనభై రెండు ఏళ్ళ క్రితం డచ్చివారు ప్రథమంగా భారత భూభాగం మీద కాలు మోపిన మచిలీపట్నంతో మొదలుకుని, నాగులవంచదాకా పదమూడు స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు వర్తకం కోసం. కొన్ని చిన్న చిన్న కోటలు, మచిలీపట్నం, పులికాట్ లాంటి ప్రదేశాలలో కొన్ని పెద్దవి కోటలు కట్టుకున్నారు, తమ అధికారులు, ఉద్యోగులు, సైనిక సిబ్బంది కోసం.

ప్రారంభం నుండీ పోర్చుగీసు వారితో, తరువాత బ్రిటిష్ వారితో నిరంతరమూ ఘర్షణ పడాల్సి వచ్చింది. నాగపట్నం కోటను తుడిచిపెట్టిన వరదలవంటి ప్రకృతి వైపరీత్యాలు కొన్నిసార్లు వారిని దెబ్బతీశాయి. కొన్నిచోట్ల స్థానిక ప్రజలు, రాజులనుండి తీవ్రమైన ప్రమాదాలు ఎదురైనాయి.

ముందుచూపుతో శత్రువులనుండి, అగ్ని ప్రమాదాల నుండి సురక్షితంగా బయట పడడం కోసం ప్రతి కోటలోనూ నలుమూలలా బయటకు రహస్య మార్గాలు ఏర్పాటు చేసుకున్నారు. స్థావరం ప్రధాన అధికారికి, నిర్మించిన పనివారికి మాత్రమే ఆ రహస్య మార్గాల ఉనికి తెలిసేలా జాగ్రత్తలు తీసుకునేవారు. కోట నిర్మాణం పూర్తి ఐన తరువాత ఈ రహస్య మార్గాల నిర్మాణం జరిగేది. ఆ తరువాత ఆ రహస్య మార్గాలను నిర్మించిన పనివారందరినీ నిర్దాక్షిణ్యంగా చంపేవారు. అలా ప్రధాన అధికారికి, ఆ తరువాత వచ్చిన అధికారికి మాత్రమే ఈ రహస్య మార్గాల గురించి తెలిసేది.

చిరుతలా కదులుతూ సరిహద్దు రాయిని సమీపించాడు జగ్గడు. నున్నటి ఆ రాయి మీద దగ్గరి నుండి పరిశీలనగా చూస్తేనే కనిపించేలా దక్షిణం వైపు మొన ఉండేలా ఒక బాణం చెక్కి ఉన్నది. ఆలస్యం చేయకుండా బలంగా ఆ రాతిని సవ్యంగా, బాణం గుర్తు తూర్పుకు వచ్చే వరకూ తిప్పాడు జగ్గడు. ప్రహరీకి, సరిహద్దు రాయికి మధ్యన రెండు అడుగుల వెడల్పు ఐదడుగుల పొడవున నేలలా కంటికి కనిపిస్తున్న ఫలకం పక్కకు తొలిగి సొరంగ మార్గం మెట్లతో ప్రత్యక్షమైంది.

జగ్గడి కనులే మౌనంగా ఆజ్ఞలు జారీ చేస్తున్నాయి. ఒకరి వెంట ఒకరుగా అందరూ లోపలికి దిగిన తరువాత ఆఖరుగా తను లోపలికి దిగే ముందు దుబాసీ దామోదర శర్మను తలుచుకుని మనసులోనే నమస్కరించుకున్నాడు జగ్గడు. ఆయనే లేకుంటే ఈ రహస్య మార్గాల ఉనికి రహస్యంగానే మిగిలిపోయేది.

ముఖ్యమైన దస్తావేజులు తర్జుమా చేసే సమయంలో అధికారుల అజాగ్రత్త వలన అత్యంత విలువైన దస్తావేజు దామోదర శర్మ కంటబడింది. రహస్య మార్గ నిర్మాణం, నిర్మించిన పనివారిని నిశ్శేషంగా నిర్మూలించడం గురించి పులికాట్ అధికారులకు పంపిన నివేదిక అది. నాగులు, జగ్గడు, ముఖ్యమైన మరొక ఇద్దరితో దగ్గరుండి రహస్య మార్గం నిజమేనని తెల్సుకున్నాడు దామోదర శర్మ. తన ప్రాణాలను లెక్క చేయకుండా వోలందుల అంతం చూడడానికి తెగించిన దామోదర శర్మకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ సొరంగంలోకి దిగాడు. మెట్ల పక్కన గోడకు అమర్చిన చక్రాన్ని తిప్పగానే సొరంగ మార్గం మూసుకుపోయింది.

(కొనసాగింపు వచ్చే సంచికలో...)

COMMENTS